క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



మునగాలలో బాధితులకు సరకులు అందజేస్తున్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం మునగాల గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు జక్కంపూడి రామ్మోహన్‌రావు చారిటబుల్ ఫౌండేషన్ చేయూత అందించింది. ఈ మేరకు శనివారం నిత్యావసర సరకులు, వంట సామగ్రి పంపిణీ చేసింది. ఇటీవల మోరంపూడి రమణమ్మ కుటుంబానికి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. వీరికి అక్షయ సంజీవని పథకం ద్వారా బియ్యం, సరుకులు అందజేశారు. అనేక ఘటనల్లో బాధితులను ఫౌండేషన్ ఆదుకుంటుందని పలువురు అన్నారు. మునగాల ఎంపీటీసీ సభ్యుడు చింతాకుల లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగులాపల్లి వెంకన్న, ద్రోణుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

మధురపూడి: కోరుకొండ రాజబాబు జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్ష జరిగింది. దీనికి 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం జనరల్ విద్యార్థులు 392 మందికి 383 మంది పరీక్ష రాశారు. ఒకేషనల్ పరీక్షలకు 82 మందికి 73 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను సూపరింటెండెంట్ ఎస్.రామచంద్రరావు పర్యవేక్షించారు.

పరీక్షలకు పది మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో నాలుగో రోజైన శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పేపర్–2 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 207 మంది హాజరు కావాల్సి ఉండగా 200 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 217 మంది హాజరు కావాల్సి ఉండగా 214 మంది హాజరయ్యారు. మొత్తంగా 10 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకృష్ణ, సీహెచ్‌ఏ శిరీషలు తెలిపారు. సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మేథమెటిక్స్, బోటనీ, సివిక్స్ పేపర్–1 పరీక్ష నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

అకాల వర్షంతో బిజీ

సీతానగరం: మండలంలో అకాల వర్షంతో పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు బిజీ అయ్యారు. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటనతో రైతులు ముందుగానే జాగ్రత్త పడ్డారు. మొక్కజొన్న రైతులు కంకిలను ఆరబెట్టి అమ్మకాలు జరిపే సమయంలో వర్షాలతో ఇబ్బందులకు గురవుతున్నారు. కళ్లాలో ఆరబెట్టిన మొక్కజొన్న కంకిలపై వర్షాలకు తడవకుండా బరకాలు, టార్పాలిన్‌లు వేసి ఒబ్బిడి చేసుకున్నారు. అలాగే నాటు పొగాకు రైతులు పాకలలో ఉంచిన పొగాకు తడవకుండా పాక లోపల తాటాకులు, బరకాలు, టార్పాలిన్లు వేసి తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వర్జీనియా పొగాకు రైతులకు మాత్రం ఈ వర్షం కొంత నష్టం కలిగిస్తుంది.

గోకవరంలో భారీ వర్షం

గోకవరం: మండలవ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. రబీలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క మామిడి, జీడిమామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గళ్లలో ఫ్యామిలీ ఫిజీషియన్



ముగ్గళ్లలో ఇంటి వద్ద రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: ముగ్గళ్లలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 1,035 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. రోగులకు అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేశారు. ఎంపీయూపీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రపర్చుకునే విధానం, దాని ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ పావని, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు, ఏఎన్ఎం బేగం తదితరులు పాల్గొన్నారు.

అగ్గి రేగితే.. మిగిలేది బుగ్గే

- అజాగ్రత్త, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు
- అప్రమత్తతతో ప్రమాదాల నివారణ
- వేసవిలో ముందస్తు జాగ్రత్తలే కీలకం



అనపర్తిలో అగ్నిమాపక కేంద్రం

అనపర్తి: వేసవి.. మండించే కాలం.. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం. రెప్పపాటు నిర్లక్ష్యం ఆస్తులను బుగ్గి చేయడంతో పాటు ప్రాణాలను హరిస్తుంది. మండే ఎండలే అగ్నికి ఆజ్యం పోస్తాయి. ప్రమాద తీవ్రతను రెట్టింపు చేస్తాయి. ప్రకృతిపరంగా సంభవించిన అగ్ని ప్రమాదాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్తతో సంభవించేవే అధికం. ఏదేమైనా ముందు జాగ్రత్తలతో ప్రమాదాలను అరికట్టవచ్చని అగ్నిమాపక అధికారులు తెలియజేస్తున్నారు. అనపర్తి, పరిసర నియోజకవర్గాల పరిధిలో గతంలో సంభవించిన ఘటనల్లో ఎన్నో కుటుంబాలు కుట్టుబట్టలతో మిగిలాయి. 2022–23 నుంచి ఈ ఏడాది మార్చి 13 వరకూ వివిధ అగ్ని ప్రమాదాలకు సంబంధించి అనపర్తి ఫైర్ స్టేషన్‌కు మొత్తం 55 కాల్స్ వచ్చాయని అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదాల్లో రూ.1.18 కోట్ల ఆస్తి నష్టం సంభవించగా, రూ.1.96 కోట్ల మేర ఆస్తిని కాపాడామన్నారు. 2019–20లో 93 అగ్ని ప్రమాదాలు సంభవించగా సుమారు రూ. 14.38 కోట్ల నష్టం వాటిల్లింది.

ముందు జాగ్రత్తలే మేలు

ఎండా కాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ప్రమాదాలు సంభవిస్తే 101కు ఫోన్ చేయాలి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్‌లలో నిబంధనలు పాటించాలి. మంటలు చెలరేగిన సందర్భాల్లో వాటి అదుపునకు వినియోగించే పరికరాలు అందుబాటులో ఉంచాలి. అదేవిధంగా ఇళ్లలో గ్యాస్ ప్రమాదాలు ఎక్కువగా చూస్తుంటాం. వంట గ్యాస్ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వాల్వు ఆఫ్ చేయాలి. గ్యాస్ ట్యూబ్‌ను విధిగా ప్రతి ఆరు నెలలకోసారి మార్చడంతో పాటు ఐఎస్ఐ మార్కు ఉన్న గ్యాస్ ట్యూబ్‌నే వినియోగించాలి. గ్యాస్ లీకైన సందర్భాల్లో విద్యుత్ బోర్డులోని స్విచ్‌లను వేయడం, ఆపడం చేయకూడదు. వంట గదిలో కిరోసిన్, డీజిల్ పెట్రోలు, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచరాదు. ఊరికి వెళుతున్నప్పుడు ఇంట్లోని విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. చిన్నారులకు అగ్గిపెట్టె, లైటర్ అందనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, చుట్ట, బీడీ కాల్చిన వారు వాటిని పూర్తిగా ఆర్పిన తర్వాత పడేయాలి. ప్రమాద ఘటనలో మంటలు చెలిరేగిన సమయంలో వచ్చే పొగ కారణంగా ఎక్కువ ప్రాణనష్టం జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో నేలపై పాకుతూ ముందుకు వెళ్లడంతో పాటు నోటికి అడ్డంగా తడిగుడ్డ ఉంచి గాలి పీల్చేందుకు ప్రయత్నించాలి.

చైతన్యం తీసుకొస్తున్నాం..



ప్రమాదం సంభవిస్తే వెంటనే అగ్నిమాపక కేంద్రం ఫోన్ (101) కాల్ చేయాలి. వెంటనే సిబ్బంది స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నాం. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో ఫైర్ ఇంజిన్ ద్వారా ప్రయోగాత్మకంగా ప్రదర్శనలను చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నాం. అనపర్తి అగ్నిమాపక కేంద్రం ల్యాండ్ నంబర్ 08857 227201.

– జె.శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపక కేంద్ర అధికారి, అనపర్తి

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



బలభద్రపురంలో ప్రతిష్ఠించిన మహాలక్ష్మి అమ్మవారు



కొంకుదురులో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసింది. గ్రామానికి చెందిన ఆడపడుచుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

కల్యాణ వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని కొంకుదురులో శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఏర్పేడు పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి, వాసుదేవానందగిరి స్వాముల ఆధ్వర్యంలో పూజా క్రతువును నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణానికి మంగళ సూత్రాలను ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా స్వామికి అందజేశారు. పూజా కార్యక్రమాల్లో విగ్రహ పత్రిష్ఠకర్తల కుమార్తె అయిన సినీనటి మల్లిడి శ్రీరెడ్డి పాల్గొన్నారు. కల్యాణ క్రతువులో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి సత్తి వెంకట సూర్యనారాయణరెడ్డి, లలిత, సత్తి నాగిరెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం



ఐఎంఏ–జీబీఆర్ టాలెంట్ టెస్ట్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

అనపర్తి: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి వారిని ప్రోత్సహించే ఉన్నత లక్ష్యంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అనపర్తి శాఖ, జీబీఆర్ విద్యాసంస్థలు సంయుక్తంగా ఏటా ఉచిత విద్యా పథకాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి అన్నారు. జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు అధ్యక్షతన స్థానిక నారాయణరెడ్డి కంటి ఆసుపత్రి ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ–జీబీఆర్ టాలెంట్ టెస్ట్ 2023–24 బ్రోచర్‌ను డాక్టర్ సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగుర్రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నర్సరీ నుండి పదోతరగతి వరకు ఒక్కొక్క తరగతి నుండి ఐదుగురు చొప్పున మొత్తం 65 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ఐఎంఏ అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థిక వెసులుబాటు లేని విద్యార్థులు ఈ పథకం ద్వారా ఉచిత విద్యను అందించటం జరుగుతోందని, అనపర్తి, బిక్కవోలు, రాయవరం, పెదపూడి, రంగంపేట, రాజానగరం, మండపేట, మండపేట రూరల్, మొత్తం మండలాలకు చెందిన విద్యార్థులకు ఈ ఉచిత విద్యా పథకానికి అర్హులని తెలిపారు. తేతలి కొండబాబు మాట్లాడుతూ ఈ పరీక్షకు సంబంధించి ఈ నెల 23 నుంచి ఏప్రియల్ 2వ తేదీ వరకు జీబీఆర్ విద్యాసంస్థల కార్యాలయంలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని హాల్ టికెట్లు పొందాలని తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామని, దీనికి ఏ విధమైన ఫీజు చెల్లించనవసరం లేదని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ తేతలి వెంకటరామిరెడ్డి, డాక్టర్ తేతలి సంధ్యారెడ్డి, జీబీఆర్ పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి, విద్యాసంస్థల పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు



విశేష అలంకరణలో శ్రీదేవి–భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి–భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి ఆలయంలో జరుగుతున్న 23వ శ్రీరామ అఖండ భజన సప్తాహ మహోత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు ఉదయం 9 గంటలకు అఖండ హోమం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సప్తాహ భజన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు చిలకమర్రి మురళీ కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులచే ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సప్తాహ భజన పోటీల్లో వివిధ ప్రదేశాల నుంచి 6 భజన సమాజాలు పాల్గొన్నాయి. భజన పోటీలకు న్యాయ నిర్ణేతగా శ్రీరంగపట్నంకు చెందిన సీనియర్ భజన కళాకారులు అప్పలరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి, ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఓనువులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



తొర్రేడులో ఓనువులమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో అత్యంత సుందరంగా నిర్మించిన ఓనువులమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 10.18 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తొర్రేడు గ్రామస్తులే కాకుండా వెంకటనగరం, కాతేరు, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం తదితర గ్రామస్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితులు సి.సత్యనారాయణ శాస్త్రి శిష్య బృందం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, యంత్ర స్థాపన, పూర్ణాహుతి జరిగింది. శ్రీబాలాజీ లేవుట్‌లో అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం మొదలైన అన్న సమారాధన సాయంత్రం వరకు కొనసాగింది.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



కణుపూరులో జీడిమామిడి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి రిని

మధురపూడి: తేయాకు దోమ కారణంగా జీడిమామిడి తోటలకు వైరస్ సోకుతుందని ఉద్యాన అధికారి పి.రినీ అన్నారు. తేనె మంచు ఉధృతంగా ఉండటం, తుపాను కారణంగా ఉద్యాన వనాలకు వివిధ తెగుళ్లు సోకుతున్నాయన్నారు. శనివారం కోరుకొండ, గోకవరం మండలాల్లోని వివిధ మామిడి, జీడిమామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. జీడిమామిడిలో వచ్చే వైరస్ తెగులు నివారణకు లాంబ్డా సైహాలోత్రిన్ 2.5 ఈసీ 600 ఎంఎల్‌ను ఎకరం విస్తీర్ణానికి పిచికారీ చేయాలన్నారు. అలాగే 10 రోజుల వ్యవధిలో ఇమిడాక్లోప్రిడ్ మందు 500 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయడం ద్వారా నివారించవచ్చన్నారు. మామిడిలో వచ్చే మంగు తెగులు నివారణకు ఇమిడా, లేదా ఫిప్రోనిల్ మందు 600 ఎంఎల్ చొప్పున ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. తేనె మంచు ఉధృతి కారణంగా మామిడిలో పూత మాడిపోతున్న పరిస్థితిని గుర్తించారు. దీనికి క్లోరోసైలిఫాస్ 600 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గోకవరం: మామిడి, జీడిమామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కోరుకొండ ఉద్యానవనశాఖ అధికారి పి.రిణి అన్నారు. మండలంలోని మామిడి, జీడి మామిడి తోటలను శనివారం ఆమె పరిశీలించారు. ఆయా తోటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

నన్నయలో స్వచ్ఛ ఉత్సవ్ సదస్సు



సదస్సులో వీసీ ఆచార్య ప్రసాదరాజు తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సహకారంతో శనివారం స్వచ్ఛ ఉత్సవ్ సదస్సు జరిగింది. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ ఉత్సవ్ విన్ అవార్డులు, గార్బేజ్ ఫ్రీ సిటీ ఇన్ఫ్లూయెన్సెస్, స్వచ్ఛ యాత్ర, స్వచ్ఛత ప్లెడ్జ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. 'మై వేస్ట్ మై రెస్పాన్సిబులిటీ టూ సెగ్రిగేట్' అనే నినాదాన్ని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. నగరపాలక సంస్థ కమ్యూనికేషన్ ప్రతినిధి జేఎస్ఆర్ అన్నమయ, నిపుణుడు షేక్ సైదా తబసమ్, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, ఈసీ మెంబర్లు ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సు కింద పడి మహిళకు తీవ్ర గాయాలు



రమణిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

మధురపూడి: కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం.. నిడదవోలు ఆశ్రమానికి చెందిన పార్వతి కోరుకొండలోని రమణి ఇంటికొచ్చారు. అక్కడి నుంచి తిరిగి ప్రయాణం నిమిత్తం బస్టాండ్‌కు వచ్చారు. బయలుదేరుతున్న బస్సును ముందు నుంచి కంగారుగా దాటడంతో బస్సు ముందు చక్రం ఎక్కేసింది. దీంతో ఆమె రెండు కాళ్లు, కుడి చేయి విరిగిపోయింది. ఆమెను స్థానికులు, పోలీసులు అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. తనకెవరూ లేరని, ఇప్పుడు తన పరిస్థితి ఏంటని ఆమె రోదించింది. బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులకు తెలిపారు. ఈ మేరకు వారు హాస్పటల్ వెళ్లి అత్యవసర విభాగంలో సేవలు అందించాలని వైద్యులకు తెలిపారు.

చోరీ కేసు నమోదు

సీతానగరం: చినకొండేపూడికి చెందిన ఇందుకూరి శ్రీలక్ష్మికి చెందిన స్కూటీ చోరీ చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ శనివారం తెలిపారు. 16న సీతానగరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద శ్రీలక్ష్మి తన స్కూటీని ఉంచి, బ్యాంక్‌లోకి వెళ్లారు. బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కేంద్ర కారాగారానికి పీడీ యాక్టు నిందితుడు

రంగంపేట: పీడీ యాక్టు నిందితుడిని కేంద్ర కారాగారానికి తరలించినట్టు రంగంపేట ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. శనివారం సాయంత్రం ఆమె తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన బొమ్మొత్తుల ఏసుబాబు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ మాధవీలత ఉత్తర్వుల మేరకు ఏసుబాబుపై పీడీ యాక్టు నమోదుచేసి శనివారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించామని చెప్పారు. మండలంలో ఎవరైనా సారా తయారీ, రవాణా, విక్రయాలు తదితర చర్యలకు పాల్పడితే వారిపైనా పీడీ యాక్టు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

వంశీకి అభినందన



వీసీ ఆచార్య ప్రసాద్‌రాజు నుంచి జాతీయ సమగ్రత సర్టిఫికెట్ అందుకుంటున్న వంశీ

రాజానగరం: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలోని వైఎన్ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో చురుకైన పాత్ర వహించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థి సిష్టి వంశీని ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాద్‌రాజు అభినందించారు. సేవా, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు జాతీయ సమగ్రతా సర్టిఫికెట్ అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీఓ ఏఎం శిరీష, డాక్టర్ డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం



రామేశ్వరం సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవిని కుమారి

పెదపూడి: గ్రామ అభివృద్ధితో పాటు సంపూర్ణ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలు అవసరమని కాకినాడ ఐడియల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి అన్నారు. శనివారం రామేశ్వరం గ్రామంలోని ఐడియల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించే ప్రత్యేక శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవినికుమారి మాట్లాడుతూ కాకినాడ, సామర్లకోట రోడ్డులోని ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కాకినాడ కళాశాల తరపున ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుటికలపూడి చినబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గుంగుమళ్ల సుబ్రహ్మణ్యం, నడింపల్లి సూర్యనారాయణరాజు, డాక్టర్ కె.స్వామీజీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆపాలి

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడు, ఎర్రంపాలెం, కొండగుంటూరులలో అనధికారికంగా జరుగుతున్న క్వారీ అక్రమ తవ్వకాలను వెంటనే ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. రాజానగరంలో ప్రదర్శన నిర్వహించి, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తుమ్మల కళావతి, గోసర దుర్గ, తోటకూర బేబి, నక్క లక్ష్మి, తామరల గౌరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవం

రాజానగరం: ఏకాదశిని పురస్కరించుకుని రాజానగరంలో శివ, కేశవుల కల్యాణోత్సవాలు శనివారం జరిగాయి. ఆలయంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత రాజలింగేశ్వరస్వామికి, రుక్మిణీ, సత్యభామా సమేత రాజగోపాలస్వామి వార్లకు కల్యాణం జరిగింది. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రగడ ఛక్రి దంపతులు, గ్రంధి సత్యనారాయణ దంపతులచే ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి శ్రీనివాస్, పురోహితుడు ఈఓ ఎం.రాంబాబురెడ్డి పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు.

కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణానికి నిధులు



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి

గోకవరం: మండలంలోని పెంటపల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాలతో మండల పరిషత్ నిధులు మంజూరు చేసినట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి తెలిపారు. పెంటపల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణ పనులను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. కమ్యూనిటీ భవనానికి రూ.2 లక్షలు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, తొట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.